# మనసుల కలయిక ముఖ్యం



*భుజ పంజరే గృహీతా*
*తత్కాలజాల పతితా*
*నవ పరిణీతా వరేణవధూః*
*బాలకురంగీవ వేపతే నితరాం*

**భావం:** వరుడు భుజ పంజరంలోకి తీసుకుంటే కొత్త పెళ్ళికూతురు అప్పుడే వలలో పడిన లేడి పిల్లలా వణికి పోతున్నది.

హిందూ మతంలో వివాహమన్నది చాలా పవిత్రమైన కర్మ. మంచి సంతానం కనడానికి హిందూ ధర్మం వివాహమనే పవిత్రకర్మను నిర్దేశించింది. వధూవరులను లక్ష్మీ నారాయణులుగా భావించి కన్యాదానమనే ముఖ్యమైన దానాన్ని పెళ్ళికూతురు తండ్రి చేస్తాడు. పెళ్ళికొడుకుని విష్ణువుగా

భావించడంలో చాలా మంచి అభిప్రాయముంది. త్రిమూర్తులలో విష్ణువుది రక్షించే ధర్మం. వివాహమయ్యేక భార్యను రక్షించవలసిన బాధ్యత భర్తమీద ఉంది. అయితే రానురానూ ఈ పవిత్ర కర్మలో లౌకిక సంప్రదాయాలు చోటుచేసుకున్నాయి. పెళ్ళికొడుక్కి తాను మహావిష్ణువు అవతారాన్ననీ, తన బంధువులంతా వైకుంఠ వాసులనీ అహంకారం ప్రవేశించింది. ఆడ పెళ్ళివారు బానిసలుగా మారిపోయారు.

అటువంటి పెళ్ళికొడుకు ఒకడు వివాహం చేసుకుందుకు మందీ మార్బలంతో కన్యాదాత గ్రామానికి తరలి వచ్చాడు. ఇప్పటివలె కల్యాణ మండపాలూ, కాటరింగ్ సర్వీసులూ లేని కాలమది. కన్యాదాత బంధువుల ఇంట్లో విడిది ఏర్పాటుచేశారు. పెళ్ళికొడుకు తండ్రి కళ్ళెర్ర చేశాడు."ఇంత చిన్న విడిదిలో ఇరుక్కు చావాలా?" ఆయనకు క్షమాపణ చెప్పుకుని శాంతింప చేశారు. స్నాతకం పూర్తయింది. కాశీ యాత్రకు వరుడు బయలుదేరవలసి ఉంది. "అయ్యా, ఇక రండి" అని పురోహితుడు పిలిచాడు. "చెప్పులేవీ" అన్నాడు పెళ్ళికొడుకు."తమకు సరైన పరిమాణం తెలియక చేయించలేక పోయాం" అన్నాడు కన్యాదాత. పెళ్ళికూతురు మేనమామలు వినయంగా గుమ్మంలో నిల్చున్నారు. వారి చెప్పులలో తనకు సరిపోయినవి ధరించి వరుడు కాశీ యాత్రలో పాల్గొన్నాడు. ఈ కాలంలోలా బజారులో చెప్పుల దుకాణాలుండే రోజులు కావవి. ప్రత్యేకంగా పురమాయిస్తే కానీ చెప్పులు తయారయ్యేవి కావు. వరుడికి చెప్పులు చేయించుకుందుకు ముప్పై కార్షాపణాలిచ్చి మేనమామ తన చెప్పులు వెనక్కి తెచ్చుకున్నాడు.

వివాహ కార్యక్రమం అలకలమధ్య పూర్తయింది. వధూవరులు అందరికీ నమస్కరించి ఆశీర్వాదాలు అందుకోవాలి. తన తల్లితండ్రులకీ, బంధువులకీ పెళ్ళికొడుకు భార్యాసమేతంగా నమస్కరించాడు.

వధువు తగినంత గౌరవం చూపలేదనిపించినప్పుడు రెండవసారి కూడా కాళ్ళకు దండం పెట్టించాడు. పురోహితుడు " అయ్యా మీ అత్తమామలకు

నమస్కరించండి" అన్నాడు. " ఇంకెంత మందికి పెట్టాలండీ" అన్నాడు పెళ్ళికొడుకు. భోజనాల వేళయింది. ఆడ పెళ్ళివారు విడిదికి వెళ్ళి మగపెళ్ళివారిని భోజనాలకు పిలిచారు. ఆడపడుచులలో ఒకామె పెరట్లో ఉంది. ఆమెకు బొట్టు పెట్టి పిలవలేదని అలిగి భోజనానికి రాలేదు. అది ఆడవారు చెప్పులు తొడుక్కునే అలవాటు లేని కాలం. మండు టెండలో కాళ్ళు మాడుతుండగా పెళ్ళికుమార్తె తల్లి మళ్ళీ విడిదికి వెళ్ళి ఆమెను ఆహ్వానించి పల్లకీ ఎక్కించి భోజనాలకు తీసుకువచ్చింది. వంటవాళ్ళలో ఒకరికి అనారోగ్యం చేసి బూరెలు వండనందుకు పెళ్ళికొడుకు తల్లి "మీకసలు సంప్రదాయం తెలుసా?" అని దులిపేసింది. వివాహాన్ని పవిత్ర కర్మగా భావించే హిందూ మత సంప్రదాయం మీకు తెలుసా అని అడగలేరు కదా. మీరు చెయ్యాల్సిన మర్యాదల మాటేమిటని అసలే అడగలేరు.

అవి పాంచరాత్ర వివాహం చేసే రోజులు. పెళ్ళి అయిదు రోజులు చేశారు. ఆ పైన తొలి రేయికి మంత్రాలు చదివి, అడపడుచులని మంగళహారతి కట్నాలతో శాంతింపచేసి, అమ్మాయిని గదిలోకి పంపారు. పెళ్ళిలో జరిగిన గొడవలలో పెళ్ళికొడుకుని ఉగ్రరూపంతోచూసిన అమ్మాయి ఒణికిపోతూ గదిలో ప్రవేశించింది. వరుడు ఆమెను తన భుజాల్లోకి తీసుకున్నాడు. ఆ స్పర్శలో ప్రేమ కన్నా అలకే ఎక్కువ కన్పించిందేమో ఆ కొత్త పెళ్ళికూతురు వలలో పడ్డ లేడి పిల్లలా వణికిపోయింది.

మంచం దిగితే యముడిగా ఉన్నవాడు మంచం మీద మాత్రం మగడవగలడా?

*****